పురుగు మందు డబ్బాలతో రైతుల ఆందోళన

వీణవంక, మార్చి 1: గ్రానైట్ క్వారీలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, యజమానులపై చర్యలు తీసుకోవాలని దేశాయిపల్లి గ్రామ రైతులు వీణవంక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం పురుగు మందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. గ్రామంలో గ్రానైట్ క్వారీల నిర్వాహకులు 15 మంది రైతుల భూముల్లో రాళ్లు పడవేస్తుండడంతో పంటలు దెబ్బతింటున్నాయని కాంపెల్లి కొమురయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు. కాగా, ఈ విషయమై తహసీల్దార్ తిరుమల్ రావు స్పందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నకిలీ పత్రాలతో భూ విక్రయం: భార్యాభర్తల అరెస్ట్

గంగాధర, మార్చి 1: నకిలీ పత్రాలతో భూమిని విక్రయించిన కేసులో భార్యాభర్తలను గంగాధర పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ పుల్ల అభిలాష్ వివరాల ప్రకారం.. గంగాధర మండలం హిమ్మత్ నగర్‌కు చెందిన మాల కనకయ్య కరీంనగర్ గాంధీనగర్ కు చెందిన సింగిరెడ్డి మోహన్‌రెడ్డి అనే వ్యాపారి వద్ద 2016లో రూ.30 లక్షలు, 2017లో రూ.26 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఇందుకు కనకయ్య, అతడి భార్య మంజుల పేరిట ఉప్పరమల్యాల శివారులో ఉన్న మూడెకరాల ముప్పై తొమ్మిదిన్నర గుంటల భూమిని మోహన్‌రెడ్డి పేరిట మార్టిగేజ్ చేయించి రెండు బ్యాంకు చెక్కులు హామీగా ఇచ్చారు. మోహన్‌రెడ్డికి తెలియకుండా కనకయ్య దంపతులు నకిలీ పత్రాలను సృష్టించి సదరు భూమిని ఇతరులకు విక్రయించారు. విషయం తెలుసుకున్న మోహన్‌రెడ్డి గంగాధర ఠాణాలో గురువారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు ప్రాథమిక విచారణ అనంతరం భార్యాభర్తలను అరెస్ట్ చేసి కరీంనగర్ కోర్టులో హాజరుపరుచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్ఐ వెల్లడించారు.

పరీక్ష సామగ్రి వితరణ

సైదాపూర్, మార్చి1: వెన్నంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంటర్‌నేషనల్ ఓమౌజయ యునైటెడ్ యంగ్‌స్టార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెట్రిబాక్స్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. సంస్థ వలంటీర్లు పాల్గొన్నారు.

'ఆపదమిత్ర'లను వెంటనే ఎంపిక చేయాలి

- రేపటిలోగా వలంటీర్ల జాబితాను అందించాలి
- అధికారులకు కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశం

ముకరంపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల(పురాతన)లో స్నేహిత కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

రాంనగర్, మార్చి 1: ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు, ఇంకా ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను కాపాడేందుకు ఉపయోగపడే ఆపదమిత్ర వలంటీర్ల ఎంపిక ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆపదమిత్ర వలంటీర్ల ఎంపిక ప్రక్రియపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వలంటీర్ల ఎంపికపై అన్ని శాఖల అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కరీంనగర్ జిల్లాలో 300 మంది ఆపదమిత్ర వలంటీర్లను ఎంపిక చేయాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధులు, గజ ఈతగాళ్లు, క్రీడాకారులు, జీపీ వర్కర్లు, స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ టీచర్లకు వలంటీర్ల ఎంపిక సందర్భంగా ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే మిగతా వారిని డిగ్రీ కాలేజీలు, యూనివర్సిటీ నుంచి ఎంపిక చేయాలని చెప్పారు. ఈ నెల మూడో తేదీలోగా ఎంపికైన వలంటీర్ల లిస్ట్ తయారుచేసి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఆపద సమయంలో బాధితులను రక్షించే అంశంపై వలంటీర్లకు 12 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని పేర్కొన్నారు. అధికారులందరూ దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌వో పవన్ కుమార్ వలంటీర్ల ఎంపిక, శిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీధర్, మెప్మా పీడీ రవీందర్, స్పోర్ట్స్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎన్‌వైకే కోఆర్డినేటర్ రాంబాబు, ఫైర్ ఆఫీసర్ వెంకన్న, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ ఆఫీసర్ రాజు, ఎన్‌సీసీ 9వ బెటాలియన్ సుబేదార్ ధ్రువ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా పాలన సహాయ కేంద్రాలను వెంటనే ప్రారంభించండి

కలెక్టరేట్, మార్చి 1: జిల్లాలో ప్రజా పాలన సహాయ కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్యాస్ సబ్సిడీ, గృహ జ్యోతి పథకాల అమలుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పథకాల అమలులో లబ్ధిదారుల ఇబ్బందులు తీర్చేందుకుగానూ ప్రజాపాలన సహాయ కేంద్రాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా పాలన సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించాలని పేర్కొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కమాన్‌చౌరస్తా, మార్చి 1 : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువులో హీరోయిజం చూపించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. జిల్లా కేంద్రంలోని ముకరంపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల(పురాతన)లో స్నేహిత కార్యక్రమంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. మంచిగా చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. ఎవరి నుంచైనా శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఉన్నా, అన్యాయానికి గురైనా విద్యార్థులు అధికారులకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్ రావు, మార్కెటింగ్ అధికారి పద్మావతి, సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కృపారాణి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శాంత, పాఠశాల హెచ్ఎం చాంద్ తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియాన్ని ఆధునీకరించండి..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న మ్యూజియాన్ని ఆధునీకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. మ్యూజియం భవనాన్ని శుక్రవారం పరిశీలించారు. ఆధునీకరణకు అంచనాలను రూపొందించాలని, నిధులు మంజూరు చేస్తానని పేర్కొన్నారు.

నగరాభివృద్ధే ధ్యేయం

- వేసవిలోగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం
- మేయర్ యాదగిరి సునీల్‌రావు

21వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, మార్చి 1: కరీంనగర్ ధ్యేయంగా తాము పని చేస్తున్నామని, నగరంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ వేసవిలోగా పూర్తి చేయించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం 21వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, తమ పాలకవర్గంలో ప్రభుత్వం నుంచి రూ.వందల కోట్ల నిధులు తీసుకువచ్చి అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. శివారు ప్రాంతాల డివిజన్లలోని ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. నగరవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నూతన కాలనీలు ఏర్పడడం వల్ల ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలంటూ ప్రజలు విన్నవిస్తున్నారని పేర్కొన్నారు. శివారు ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నగరపాలక సంస్థకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి సాగర్, స్థానిక ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని వినతి

కార్పొరేషన్, మార్చి 1 : నగరంలోని 58వ డివిజన్ జ్యోతి నగర్‌లో మోర్ సూపర్ మార్కెట్ వద్ద చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను సత్వరం పూర్తి చేయాలని ఆ డివిజన్ కార్పొరేటర్ రాపర్తి విజయ శుక్రవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలల క్రితం ప్రారంభించిన పనులు నేటికీ పూర్తికాకపోవడం, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

'బండి.. నిరూపిస్తావా? లేక క్షమాపణ చెప్తావా?'

రాంనగర్, మార్చి 1 : మంత్రి పొన్నం ప్రభాకర్ రాముడి గురించి గానీ, అయోధ్య అక్షింతల గురించి గానీ ఎక్కడైనా అనుచితంగా మాట్లాడి ఉంటే ఎంపీ బండి సంజయ్ నిరూపించాలని, లేదంటే బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటికి దగ్గరలో జరిగిన లక్ష్మీసమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రాని బండి సంజయ్ భక్తుడు ఎలా అవుతారని ప్రశ్నించారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికే రాముడిని రాజకీయాల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఆయన తన పేరును బోగస్ సంజయ్‌గా మార్చుకోవాలని సూచించారు. ఎంపీగా నియోజకవర్గం కాదు కదా.. ఒక్క గుడికి నిధులు తేలేదని విమర్శించారు. ఎంపీగా పోటీ చేసే అర్హత బండికి లేదన్నారు.

సాఫీగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం

జమ్మికుంట, మార్చి 1: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పట్టణంలో జరిగిన అభివృద్ధి, జరుగాల్సిన అభివృద్ధిపై మున్సిపల్ కౌన్సిలర్ల సమక్షంలో ఆయా శాఖల అధికారుల ఆధ్వర్యంలో సభాముఖంగా చర్చించారు. రానున్న రోజుల్లో చేపట్టనున్న పనుల గురించి తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ ఆయాజ్, మేనేజర్ భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్

ఇల్లందకుంట, మార్చి 1: ఈ నెల 2 నుంచి 7 వరకు ధరణి సమస్యల పరిష్కారానికి కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పీ రాణి తెలిపారు. మండలంలోని 10 రెవెన్యూ గ్రామాల్లో భూ సమస్యలకు సంబంధించి 161 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఈ నెల 2న చిన్నకోమటిపల్లి, వంతడుపుల, పాతర్లపల్లి, 4న రాచపల్లి, కనగర్తి, సిరిసేడు, 5న టేకుర్తి, బుజునూర్, ఇల్లందకుంట, 6న టేకుర్తి, మల్యాల, ఇల్లందకుంట, 7న రాచపల్లి, కనగర్తి, మల్యాల, పాతర్లపల్లి, సిరిసేడు గ్రామాల రైతులు పెండింగ్ సమస్యల దరఖాస్తులతో తహసీల్ కార్యాలయానికి రావాలని కోరారు.

'దళితబంధు' రెండో విడుత ప్రకటన చేయాలి

జమ్మికుంట, మార్చి 1: దళితబంధు రెండో విడుత డబ్బులు ఎప్పుడు మంజూరు చేస్తారో జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ప్రకటన చేయించాలని దళితబంధు సాధన సమితి నియోజకవర్గ నాయకులు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని రెండో విడుతను సకాలంలో విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి సభ్యులు సురేశ్, రాజేశ్, నరేశ్, రాకేశ్, ఆకాశ్, శ్రీకాంత్, వంశీ, రత్నాకర్ రావు, నాగరాజు, రక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

హుజూరాబాద్ టౌన్, మార్చి 1: ఈనెల 3వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హుజూరాబాద్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. హుజూరాబాద్ డివిజన్ పరిధిలో 22,653 మంది ఐదు సంవత్సరాల్లోపు పిల్లలు ఉండగా, 185 బూత్‌లు, తొమ్మిది మొబైల్ టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 0–5 ఏండ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు.

అల్ఫోర్స్ విద్యార్థులకు బంగారు పతకాలు

విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, మార్చి 1: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలకు చెందిన కే సుచిత్ రెడ్డి, ఎస్పీ కృష్ణ చైతన్య ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ నవార్స్ ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన అష్టనావి సైన్స్, మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు సాధించగా, వారిని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. విద్యార్థులకు పోటీ పరీక్షలపై ఆసక్తి కలిగించాలని, విజయం సాధించేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఇక్కడ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సంతాన సాఫల్య కేంద్రంపై కేసు నమోదు

రాంనగర్, మార్చి 1: పిల్లలు పుట్టట్లేదని సంతాన సాఫల్య కేంద్రాన్ని సంప్రదించిన దంపతుల వద్ద రూ. 5 లక్షలు వసూలు చేసి, మరింత నగదు కట్టాలని బంధించి దాడి చేసిన ఘటనలో ఓ సంతాన సాఫల్య కేంద్రంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్‌కు చెందిన తిరుమణి నాగలక్ష్మి–వెంకటరావు దంపతులు కరీంనగర్‌లోని ఓ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఇటీవల సంప్రదించారు. చికిత్స కోసం వైద్యురాలు ముందుగా రూ. 5లక్షలు తీసుకొన్నది. తర్వాత మరో రూ. 80 వేలు చెల్లించాలని డిమాండ్ చేసింది. ఇందుకు నాగలక్ష్మి– వెంకటరావు అంగీకరించకపోవడంతో వైద్యురాలి భర్త, సిబ్బంది వారిని నిర్బంధించి దాడి చేశారు. బాధితులు కరీంనగర్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

రాంనగర్, మార్చి 1: కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్, సీఐ, కే.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేశారు. శశికుమార్,(శాంతినగర్), రామకృష్ణ (పెగడపల్లి) జయంత్ (వరంగల్) శుక్రవారం యువకులకు గంజాయి అమ్ముతుండగా అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. 535 గ్రాముల ఎండు గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

వెంకంపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, మార్చి 1 : రాష్ట్రంలోని పల్లెల అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని కాసారం, వెంకంపల్లి, గోపాల్‌రావుపల్లి, మల్లాపూర్, కురిక్యాల, ఉప్పరమల్యాల, రంగరావుపల్లి, తాడిజెర్రి, గర్శకుర్తి, ఆచంపల్లి, చిన్నఆచంపల్లి, గట్టుభూత్కూర్, హిమ్మత్‌నగర్ గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్కం అనురాధానర్సయ్య, గంగాధర సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, ఎంపీటీసీ కోలపురం లక్ష్మణ్, నాయకులు రామిడి రాజిరెడ్డి, బట్టు లక్ష్మీనారాయణ, దుబ్బాసి బుచ్చయ్య, కోల ప్రభాకర్, సాగి అజయ్‌రావు, గడ్డం అంజయ్య, చింతల మల్లేశం, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, రుద్ర మల్లేశం, గుండవేణి తిరుపతి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల యాజమాన్య నూతన కార్యవర్గం

కమాన్‌చౌరస్తా, మార్చి 1 : తెలంగాణ డిగ్రీ, పీజీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా బొజ్జ సూర్యనారాయణ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్రీధర్ రావు, పరమేశ్, ఉపాధ్యక్షులుగా నారాయణ గౌడ్, రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా యాద రామకృష్ణ, కోశాధికారిగా శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాస్కర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ప్రకాశ్, గింజల రమణారెడ్డి, సుందర్ రాజ్, కార్యదర్శులు హరిస్మరణ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా యాద రామకృష్ణ పెద్దపల్లి జిల్లా రామకృష్ణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ముగ్గురిపై మాల్‌ప్రాక్టీస్ కేసు

కమాన్‌చౌరస్తా/ సైదాపూర్, మార్చి 1 : జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ముగ్గురిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షకు హాజరైన ముగ్గురు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం

కమాన్‌చౌరస్తా, మార్చి 1 : జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లక్ష్మీవేంకటేశ్వరాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు వానమామాలై పవన కుమారాచార్యుల ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యహోమం అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సాయంత్రం శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి రథంపై ఆలయ సమీప వీధుల్లో విహరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎంఐఎం ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనాలి

కలెక్టరేట్, మార్చి 1: ఎంఐఎం 66వ ఆవిర్భావ వేడుకల్లో ప్రతి కార్యకర్త పాల్గొనాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అహ్మద్ పాషా ఖాద్రీ పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ ఆధ్వర్యంలో రూపొందించిన భారీ బెలూన్లను పార్టీ ప్రధాన కార్యాలయం దారుసలాంలో శుక్రవారం ఎగురేశారు. శనివారం ఉదయం 10.30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు ఘాలేబ్, ఫహీం, షాకీర్ నహ్దీ, అబ్దుల్లాఖాన్, షకీలొద్దీన్ పాల్గొన్నారు.

రేకుర్తి కంటి దవాఖానలో ఏస్కాన్ ప్రారంభం

విద్యానగర్, మార్చి 1 : రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మదేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో ఏస్కాన్‌ను శుక్రవారం కరీంనగర్, సిరిసిల్ల డీఎఫ్‌వో బాలమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద ప్రజలకు కంటి వైద్య చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడం స్ఫూర్తిదాయకమన్నారు. హాస్పిటల్ చైర్మన్ కొండ వేణుమూర్తి మాట్లాడుతూ, ఉచిత కంటి ఆపరేషన్ల కోసం తమ దవాఖానను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు డాక్టర్ మురళీధర్ రావు, కోల అన్నారెడ్డి పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- వీసీలో సీఎస్ శాంతకుమారి

కమాన్‌చౌరస్తా, మార్చి 1: ఇంటర్, పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో ఇంటర్, పదో తరగతి పరీక్షలు, ప్రజాపాలన సహాయ కేంద్రాల ప్రారంభంపై శుక్రవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ క్రమంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ నుంచి కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనగా, శాంత కుమారి మాట్లాడుతూ, పరీక్షల్లో ఏ చిన్న పొరపాటు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పరీక్షకు హాజరు సమయంలో 3, 4 నిమిషాల వరకు మినహాయింపు ఇవ్వాలని సూచించారు. జిల్లాల్లో ప్రజా పాలన సహాయ కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డీఐఈవో జగన్మోహన్ రెడ్డి, డీఈసీ మెంబర్స్ కే రవీందర్ రెడ్డి, ఆంజనేయులు, జడ్పీ సీఈవో ఎం శ్రీనివాస్, డీఈవో జనార్దన్ రావు, ఎన్పీడీసీఎల్ ఎస్ ఈ గంగాధర్, కొత్తపల్లి, చొప్పదండి, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్లు రమేశ్, నాగరాజు, సమ్మయ్య పాల్గొన్నారు.

డ్రైవింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తెస్తాం

- పట్టుబడిన వాహనాలను వేలం వేస్తాం
- డీటీసీ పురుషోత్తం

వాహనాలను పరిశీలిస్తున్న డీటీసీ పురుషోత్తం

తిమ్మాపూర్, మార్చి 1: జిల్లా రవాణా శాఖ కార్యాలయంలోని డ్రైవింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తెస్తామని ఉమ్మడి జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ పెద్దింటి పురుషోత్తం తెలిపారు. శుక్రవారం కార్యాలయ ఆవరణను పరిశీలించారు. డ్రైవింగ్ ట్రాక్ మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఇందుకు నిధులు సమకూర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అలాగే గతంలో తనిఖీల్లో పట్టుబడి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను వేలం వేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తామని తెలిపారు. వాహనాల లిస్టు అందజేయాలని ఏఎంవీఐ స్రవంతికి సూచించారు. అలాగే ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వాహనదారులతో మాట్లాడారు. నిబంధనలు పాటించాలని, వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా వేసుకొని ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఇక్కడ ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ స్రవంతి, సిబ్బంది శ్రీనివాస్, రఘు, గౌస్ పాషా ఉన్నారు.

మెరిసిన పేదింటి బిడ్డలు

రవీందర్

చెండ్యాల రాణి

హుజూరాబాద్‌టౌన్, మార్చి 1: హుజూరాబాద్ పట్టణానికి చెందిన దళిత బిడ్డ మెట్టుపల్లి రవీందర్ మూడు ఉద్యోగాలు సాధించాడు. పట్టువదలని విక్రమార్కుడిలా నిరంతరం కష్టపడి చదివి తన కల నెరవేర్చుకున్నాడు. రవీందర్ ప్రస్తుతం హుజూరాబాద్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తూ, అద్దె ఇంట్లో ఉంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. 2023 ఆగస్టు 24న తన తండ్రి మొగిలి మృతిచెందినా కుంగిపోకుండా కష్టపడి చదివి ఇటీవల సర్కారు ప్రకటించిన గురుకుల విద్యాలయ జేఎల్ (పొలిటికల్ సైన్స్), పీజీటీ, టీజీటీ (సోషల్ స్టడీస్) కొలువులు సాధించాడు. ఒకేసారి మూడు ఉద్యోగాలు పొందడంపై పలువురు న్యాయవాదులు, తన స్నేహితులు అభినందనలు తెలిపారు.

హుజూరాబాద్‌కు చెందిన చెండ్యాల రాణి గురుకుల విద్యాసంస్థల్లో డీఎల్, జేఎల్ ఉద్యోగాలు సాధించింది. నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ చదువుపై మక్కువతో కష్టపడి ఎంఎస్సీ ఫిజిక్స్, బీఈడీ దాకా చదివింది. తర్వాత జమ్మికుంట, హన్మకొండలో ప్రైవేటు డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసింది. ఇటీవల మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా ఉద్యోగం సంపాదించింది. తాజాగా గురుకుల బోర్డు ప్రకటించిన ఫల